క్లుప్తంగా

మండల పరిషత్ బడ్జెట్ ఆమోదం



మాట్లాడుతున్న ఎంపీపీ చలంనాయుడు

బొండపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చల్లా చలంనాయుడు అధ్యక్షతన మండల పరిషత్ బడ్జెట్ సమావేశం గురువారం నిర్వహించారు.2024–2025 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్‌తో పాటు, 2025–2026 అంచనా బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. రూ.97.19 కోట్లతో 2025 – 2026 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్ సిద్ధం చేశామని ఎంపీపీ తెలిపారు.జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, ఎంపీడీఓ జి.గిరిబాల తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ చలం నాయుడు

బొండపల్లి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి (పీహెచ్‌సీ) వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని ఎంపీపీ చల్లా చలంనాయుడు వైద్యాధికారులు, వైద్య సిబ్బందికి సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి సలహా కమిటీ సమావేశం ఎంపీపీ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఆస్పత్రిలో వసతులు, ఇతర అవసరాలకు వైద్యారోగ్యశాఖ మంజూరు చేసిన రూ.87 వేల నిధులను దేనికి ఎంత ఖర్చు చేయాలో చర్చించారు. వైద్యాధికారులు ఎల్.సత్యనారాయణ, సమీర, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.ఎ.బాషా, వైస్ ఎంపీపీ గొండేల ఈశ్వరరావు, ఎంపీటీసీ బండారు శ్రీను, ఉప సర్పంచ్ కోళ్ల వెంకటరమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలి



మద్యం దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావు

గజపతినగరం: ప్రభుత్వ లైసెన్స్‌డ్ మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీకే మద్యం విక్రయాలు జరిగేలా చూడాలని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పైడిరామచంద్రరావు ఎక్సైజ్ పోలీసులకు సూచించారు. స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను గురువారం సాయంత్రం ఆయన సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. గ్రామాల్లో ఎవరైనా బెల్టుషాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం దావాలపేట గ్రామంలోని లైసెన్స్‌డ్ మద్యం దుకాణంలో తనిఖీ చేశారు. ఆయన వెంట స్థానిక ఎక్సైజ్ సీఐ జె.జనార్దనరావు, ఎస్ఐ పి.నరేంద్ర తదితరులున్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థిని హేమశ్రీని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వేపాడ: బక్కునాయుడుపేట మోడల్ స్కూల్‌కు చెందిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని సింగంపల్లి హేమశ్రీ జాతీయస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపికైందని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.విజయ గురువారం తెలిపారు. విద్యార్థిని హేమశ్రీ బాపట్లలో ఈనెల 26,27 తేదీల్లో నిర్వహించి రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీల్లో విజయనగరం జట్టు తరఫున పాల్గొని ఉత్తమ ప్రదర్శన కనబరిచింది. డిసెంబర్ 17న పూణెలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనుంది. విద్యార్థినిని ప్రిన్సిపాల్ తోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

దస్తూరీ మెరుగుపర్చాలి



విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎంఈఓ గంగరాజు

శృంగవరపుకోట: ప్రాథమిక పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల దస్తూరీని మెరుగుపర్చాలని ఉపాధ్యాయులకు జామి మండల ఎంఈఓ గంగరాజు సూచించారు. జామి మండలంలోని నారాయణపురం ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. విద్యార్థుల వర్క్ బుక్స్‌ను పరిశీలించిన అనంతరం, వారితో తెలుగు, ఇంగ్లిష్ పదాలను చదివించారు.

వార్షిక తనిఖీలు

వేపాడ: మండలంలోని దబ్బిరాజుపేట ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ జగదీశ్వరరావు గురువారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, ఇతర రికార్డులను, తరగతి గదుల్లో చార్టులను పరిశీలించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. హెచ్ఎం శంకరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తీర్మానాలకు తిలోదకాలు

- కూటమి నాయకులు చెప్పిన వారికే గోకులాలు
- పంచాయతీల తీర్మానాలు బుట్టదాఖలు
- మండలానికి 75 చొప్పున గోకులాల మంజూరు
- వందల సంఖ్యలో దరఖాస్తు చేసుకున్న పాడిరైతులు



కెరటాంలో నిర్మాణంలో ఉన్న గోకులం

బొండపల్లి: పాడి రైతులందరికీ రాయితీపై మినీగోకులాలు, గోకులాల యూనిట్లు కేటాయిస్తామంటూ కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పింది. తీరా ఆచరణలో తుస్సుమనిపించింది. గోకులాల కోసం గజపతినగరం క్లస్టర్ పరిధిలోని ఆరు మండలాల నుంచి వందల సంఖ్యలో పాడిరైతులు దరఖాస్తు చేసుకుంటే, అధికారులు పదుల సంఖ్యలో మంజూరు చేశారు. గ్రామ సర్పంచ్ ఆమోదం తెలుపుతూ తీర్మానం చేసిన అంగీకారపత్రం ఉంటేనే మంజూరు చేయాలనే నిబంధన ఉంది. కానీ సర్పంచ్‌లు తీర్మానాలను కాదని కూటమి నాయకులు సిఫార్సు చేసిన వారికే అధికారులు గోకులాలు కేటాయించారని పాడి రైతులు ఆరోపిస్తున్నారు. గజపతినగరం క్లస్టర్ పరిధిలోని బొబ్బిలి, బొండపల్లి, దత్తిరాజేరు, గజపతినగరం, మెంటాడ, రామభద్రపురం మండలాల పరిధిలో మండలానికి 75 చొప్పున 450 గోకులాలు మంజూరు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా 280 మాత్రమే మంజూరు చేశారు. వీటి కోసం ప్రతీ మండలం నుంచి వందల సంఖ్యలో పాడి రైతులు తమ పంచాయతీ సర్పంచ్‌ల తీర్మానంతో దరఖాస్తు చేసుకున్నారు. ఇలా ఆరు మండలాల్లోనూ దరఖాస్తు చేసుకున్న వారిలో అధికార పార్టీ నాయకులు సూచించిన 192 మందినే అధికారులు అర్హులుగా గుర్తించి గోకులాలు మంజూరు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో గ్రామం నుంచి 10 నుంచి 20 మంది పాడిరైతులు దరఖాస్తు చేసుకుంటే ఒకరిద్దరికే మంజూరు కావడంతో మిగతా వారు అధికారుల తీరుపై ఆగ్రహంగా ఉన్నారు.

ఇవీ నిబంధనలు

మినీ గోకులాలకు సంబంధించి రెండు పాడి పశువుల మినీ గోకులం యూనిట్ విలువ రూ.1,15,000. ఇందులో ఉపాధిహామీ నిధుల నుంచి రూ.1,03,500 రాయితీ వర్తించగా, లబ్ధిదారుడు రూ.11.500 పెట్టుకోవాలి. నాలుగు పశువుల యూనిట్ విలువ రూ.1,85,000 కాగా, ఉపాధి హామీ నిధులు రూ.1.66,500 ఇస్తారు. లబ్ధిదారుడు వాటాగా రూ.18,500 పెట్టుకోవాలి. ఆరు పశువుల యూనిట్ విలువ రూ. 2,30,00 కాగా అందులో ఉపాధి హామీ నిధులు 2,07,000 కేటాయిస్తారు. లబ్ధిదారుడు వాటాగా రూ.23 వేలు పెట్టుకుంటే చాలు.

నిబంధనల మేరకే మంజూరు చేస్తున్నాం

పాడి రైతుల నుంచి గోకులాల కోసం వచ్చిన దరఖాస్తులను పశుసంవర్ధకశాఖ అధికారులు పరిశీలించి, నిబంధనల మేరకు మంజూరు చేస్తున్నాం. క్షేత్ర స్థాయిలో నిర్మాణాలను పరిశీలించి నిధులు చెల్లింపులు చేస్తాం.

– జి.జనార్దనరావు, ఉపాధి హామీ ఏపీడీ, గజపతినగరం క్లస్టర్

అందరికీ మంజూరు చేయాలి

బొండపల్లి పంచాయతీ పరిధిలో గోకులాల కోసం 50కు పైగానే పాడి రైతులు దరఖాస్తులు తీసుకుని వస్తే తీర్మానం చేసి ఇచ్చాం.దరఖాస్తు చేసుకున్న వారందరికీ గోకులాలు మంజూరు చేయాలి.

– బొండపల్లి ఈశ్వరరావు, బొండపల్లి సర్పంచ్

డైవర్షన్ పాలిటిక్స్‌తో కాలయాపన

- హామీల అమలు, లా అండ్ ఆర్డర్‌లో కూటమి ప్రభుత్వం విఫలం
- సంపద సృష్టిస్తామని చెప్పి ప్రజల సంపద దోచుకుంటున్నారు
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతకాక రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌తో కాలయాపన చేస్తోందని గజపతిన గరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆరోపించారు.స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడం లేదని, అన్ని వర్గాల వారిని నమ్మించి మో సం చేశారని మండిపడ్డారు. ప్రభుత్వం ప్రజాసంక్షేమం, అభివృద్ధిపై దృష్టిపెట్ట కుండా రోజుకో అంశంతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందన్నారు. రైతుల భూసమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సమగ్ర భూసర్వే చేయించగా దానిపై ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికల ద్వారా అప్పటిలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తప్పుడు రాతలు రాయించి ప్రజల్లో లేనిపోని అనుమానాలను రేకెత్తించారని గుర్తు చేశారు. ఇప్పుడు అదే సర్వేను కూటమి ప్రభుత్వమూ చేయిస్తోందన్నారు. విద్యుత్ చార్జీలు, నిత్యావసర సరుకుల ధరలపై కూడా ఎల్లోమీడియా ద్వారా దుష్ప్రచారం చేశారని, నేడు ప్రభుత్వం విద్యుత్ చార్జీలను భారీగా పెంచి ప్రజలపై భారం మోపుతోందన్నారు. ఆఖరికి తిరుపతి లడ్డూను కూడా రాజకీయం చేశారంటే ఈ ప్రభుత్వాన్ని ఏమనుకోవాలని మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్ట్ ఎత్తు తగ్గించేలా కేంద్రం నిర్ణయం తీసుకుంటే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మౌనంగా ఉన్నారని, ప్రాజెక్టు ఎత్తు తగ్గిస్తే ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి నీరు రాదని, ఇది దుర్మార్గం కాదా అని ప్రశ్నించారు. ప్రభుత్వ పెద్దలు, కూటమి నాయకులకు దమ్ము, ధైర్యం ఉంటే గత ప్రభుత్వంపై, జగన్‌మోహన్‌రెడ్డిపై ఈనాడు,ఆంధ్రజ్యోతి పత్రికల్లో రాయిస్తున్న రాతల్లో ఒక్క అంశాన్నయినా నిరూపించగలరా అని సవాల్ చేశారు. ప్రభుత్వం చేస్తున్న తప్పులను అసెంబ్లీలో ఎత్తిచూపుతారనే భయంతోనే జగన్‌మోహన్ రెడ్డికి ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదని అన్నారు.

ప్రశ్నిస్తే కేసులా..?

సూపర్ సిక్స్ పథకాలతో పాటు రాష్ట్రంలో చిన్నారులు, బాలికలు,మహిళలపై జరుగుతున్న దాడులపై సోషల్ మీడియాలో ఎవరైనా ప్రశ్నిస్తే కేసులు పెట్టి జైల్లో పెడుతున్నారని, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం కూడా తప్పేనా అని బొత్స నిలదీశారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు నిత్యకృత్యమై పోయాయని, గంజాయి రవాణా విచ్చలవిడిగా సాగుతోందని, ఊరూరా బెల్టుషాపులు వెలుస్తున్నాయని, ఇదంతా ప్రభుత్వ చేతకాని తనం వల్లేనని విమర్శించారు. ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజు త్వరలోనే వస్తుందన్నారు. జెడ్పీటీసీ గార తవుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, నాయకులు బెల్లాన త్రినాథరావు, కడుపుట్ల పైడిపునాయుడు, పి.నారాయణమూర్తి, గేదెల జగదీశ్వరరావు, కంది తిరుపతినాయుడు, కర్రి రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లుల్లో తనిఖీలు



గంట్యాడ: సిరిపురంలోని శ్రీనివాస్ మిల్లులో ట్రక్ సీట్‌పై సిబ్బందినిఆరా తీస్తున్న జేసీ సేథుమాధవన్



లక్కవరపుకోట: రంగరాయపురం రైస్ మిల్లులో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ కీర్తి

గంట్యాడ: మండలంలోని రావివలసలోని కనకదుర్గ రైస్ మిల్లు, సిరిపురంలోని శ్రీనివాస్ రైస్ మిల్లులో జాయింట్ కలెక్టర్ సేథుమాధవన్ గురువారం తనిఖీలు నిర్వహించారు. ధాన్యం సేకరణకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ట్రక్ షీట్లపై ఆరా తీశారు. ట్రక్ షీట్ లేకుండా ధాన్యాన్ని మిల్లులో దించవద్దన్నారు. ధాన్యాన్ని మిల్లులో దించిన వెంటనే మిల్లు యజమాని ట్యాగ్ చేయాలని, ఈ ప్రక్రియ ఏరోజుకు ఆరోజే జరగాలన్నారు. మిల్లులకు ధాన్యం తరలింపు ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాల్సిన బాధ్యత కస్టోడియన్ అధికారులదేనని స్పష్టం చేశారు. ఆయన వెంట సివిల్ సప్లయిస్ డీఎం మీనాకుమారి, తహసీల్దార్ నీలకంటేశ్వరరెడ్డి, సీఎస్‌డీటీ మూర్తి తదితరులున్నారు.

గంటలోపే అన్‌లోడ్ చేయాలి

లక్కవరపుకోట: రైతులు ట్రాక్టర్లు, లారీలు, ఇతర వాహనాలతో రైస్ మిల్లులకు తీసుకువచ్చే ధాన్యాన్ని గంటలోపే అన్‌లోడ్ చేయాలని విజయగనరం ఆర్డీఓ దాట్ల కీర్తి మిల్లు సిబ్బందికి సూచించారు. రంగరాయపురం గ్రామ సమీపంలోని రైస్ మిల్లులో గురువారం ఆమె తనిఖీలు చేశారు. ధాన్యం అన్‌లోడింగ్, ట్రక్ సీట్లు మంజూరు ప్రక్రియతో పాటు, మిల్లులో ధాన్యం నిల్వలను పరిశీలించారు. ఈనెల 30వ తేదీ వరకు తుఫాన్ ప్రభావం ఉంటుందని, వరి కోతలు, నూర్పులు వాయిదా వేసుకునేలా గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ ప్రసాదరావును ఆర్డీఓ ఆదేశించారు. ఆర్డీఓ వెంట డీటీ టి.రమేష్, సీఎస్‌డీటీ జయలక్ష్మి తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీపురుపల్లి: గరివిడి–రణస్థలం ఫీడర్‌లో మండలంలోని నాగంపేట వద్ద 33 కేవీ లైన్ ఏబీ స్విచ్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.శ్రీహరి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మండలంలోని రామలింగాపురం, మెట్టపల్లి, కర్లాం, కరకాం, పి.కె.పాలవలస, నిమ్మలవలస, పెదనడిపల్లి, గొల్లలములగాం పంచాయతీలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అవగాహన సదస్సు రేపు

చీపురుపల్లి: మాదక ద్రవ్యాల నిర్మూలన, ఎయిడ్స్ వ్యాధి నివారణపై విద్యార్థులకు ఈ నెల 30న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు రెడ్‌క్రాస్ కో–ఆర్డినేటర్ బి.వి.గోవిందరాజులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు పట్టణంలోని రాధామాధవ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఈ అవగాహన సదస్సుకు ఆర్డీఓ జి.వి.సత్యవాణి, డీఎస్పీ ఎస్.రాఘవులు, వైద్యుడు కుమార్ హాజరు కానున్నారని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

చీపురుపల్లిరూరల్ (గరివిడి): బామిని మండలంలోని నేరడి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తున్న శ్రీనివాసరావు గజపతినగరంలో నిర్వహించిన శిక్షణలో గుండెపోటుతో గురువారం మృతి చెందడంతో యూటీఫ్ ఆధ్వర్యంలో గరివిడి మండల ఉపాధ్యాయులు విద్యావనరుల కేంద్రం వద్ద నిరసన తెలిపారు. ప్రభుత్వ మొండి వైఖరి నశించాలని,ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేసే శిక్షణలను రద్దు చేయాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గుండెపోటుతో మరణించిన ఉపాధ్యాయుడికి ప్రభుత్వం కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ నాయకులు డి.రాము, ఏ.సత్యశ్రీనివాస్, జి.పద్మావతి,రవికుమర్, గోపాలకృష్ణ, సూరిశ్రీను, ఎం.సూర్యనారాయణ, ఐ.సత్యనారాయణ, బంగార్రాజు, సతీష్, కనకేశ్వరరావు, వరప్రసాద్,కోట్ల రమణ పాల్గొన్నారు.

ఓం సదనంలో లక్ష బిల్వార్చన



ఓం సదనంలో 108 శివలింగాలకు లక్ష బిల్వార్చన

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గేటు సమీపంలో గల ఓం సదనం ఆశ్రమంలో 108 శివలింగాలకు పురోహితులు అంపోల ఉమామహేశ్వరశర్మ ఆధ్వర్యంలో గురువారం లక్ష బిల్వార్చన, ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప,శివమాల ధారణ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలో గరుడాద్రి కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్షతులసీ దళ పూజ నిర్వహించారు.అనంతరం ఆలయం వద్ద అన్నదానం చేశారు.

పాఠశాల సందర్శన

వేపాడ: మండలంలోని సోంపురం ఉన్నత పాఠశాలను ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు గురువారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరంతో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

డిసెంబర్ 7న పాఠశాలల్లో మెగా సమావేశాలు



మాట్లాడుతున్న ఆర్జేడీ విజయ్ భాస్కర్

బొండపల్లి: ప్రభుత్వ యాజమాన్యాల కింద పనిచేసే అన్ని పాఠశాలల్లో డిసెంబర్ 7వ తేదీన తల్లిదండ్రుల మెగా సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆర్జేడీ బి.విజయ్‌భాస్కర్ తెలిపారు. స్థానిక విద్యావనరుల కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. రికార్డులు పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు దాతలు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులతో ప్రతీ పాఠశాలలో సమావేశాలు నిర్వహించాలని అన్ని మండలాల ఎంఈఓలకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. సమావేశాల్లో పాఠశాలల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, సలహాలు తెలుసుకోవడంతో పాటు, విద్యార్థుల అభ్యసనాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఎంఈఓలు కె.శోభారాణి, అల్లు వెంకటరమణ పాల్గొన్నారు.

గంజాయి రవాణా నియంత్రణకు డైనమిక్ చెక్‌పోస్టులు

- విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి



చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి డీఎస్పీ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి



మెరకముడిదాం: బుధరాయవలస పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న డీఐజీ

చీపురుపల్లిరూరల్(గరివిడి): గంజాయి రవాణాపై నిఘాపెట్టాలని పోలీస్ సిబ్బందికి విశాఖపట్నం రేంజ్ డిఐజీ గోపినాథ్ జెట్టి సూ చించారు. గరివిడిలోని డీఎస్పీ కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. రికార్డులు,సీడీ ఫైల్స్ పరిశీలించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు,చిన్నపిల్లలపై అఘాయిత్యాలను అరికట్టేందుకు, గంజాయి, మాదకద్రవ్యాల రవాణా, వినియోగాన్ని నియంత్రించేందుకు, సైబర్ నేరాలపై 'సంకల్పం' అనే కార్యక్రమం ద్వారా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నా మన్నారు. ఎవరైనా గంజాయి రవాణా చేసినా, వినియోగించినట్లు తెలిసిన వారు1972 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. గంజాయి రవాణా నియంత్రణకు డైనమిక్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని, ప్రత్యేక బృందాలను నియమించామని తెలిపారు. ఆయన వెంట జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్, డీఎస్పీ ఎస్.రాఘవులు, సీఐ జి.శంకరరావు, గరివిడి ఎస్ఐ బి.లోకేశ్వరరావు ఉన్నారు.

ప్రజలకు అవగాహన కల్పించండి

మెరకముడిదాం: ఫ్రెండ్లీ పోలిసింగ్ విధానాన్ని అమలు చేస్తూ గంజాయి, మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలతో పాటు సైబర్ మోసాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై యువత, ప్రజలకు అవగాహన కల్పించాలని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి పోలీసు అధికారులకు, సచివాలయ మహిళా పోలీసులకు సూచించారు. మండలంలోని బుధరాయవలస పోలీస్‌స్టేషన్‌ను గురువారం సందర్శించారు. రికార్డులను పరిశీలించి,పెండింగ్ కేసులపై ఎస్ఐ లోకేష్‌కుమార్‌ను ఆరా తీశారు. అనంతరం మహిళాపోలీసులతో సమావేశమయ్యారు. గ్రామాల్లో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్పీ వకుల్‌జిందాల్‌తో కలిసి మొక్కలు నాటారు. ఆయన వెంట డీఎస్పీ ఎస్.రాఘవులు, చీపురుపల్లి సీఐ జి.శంకరరావు, స్పెషల్‌బ్రాంచ్ సీఐ లీలారావు, గరివిడి ఎస్ఐ బి.లోకేశ్వరరావు ఉన్నారు.

తీర్మానాలంటే లెక్కలేదు..!

గుర్ల: ఉపాధి హామీ పథకం ఏపీఓ కామేశ్వరరావు పంచాయతీ తీర్మానాలను లెక్క చేయకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తూ మినిగోకులాలను మంజూరు చేస్తున్నారని జమ్ము సర్పంచ్ గొర్లె నరసింహమూర్తి ఆరోపించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏపీఓ కామేశ్వరరావుపై కలెక్టరేట్‌లో ఇటీవల నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

జమ్ము పంచాయతీలో ఉపాధి హామీ పథకం కిందిస్థాయి ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేసి, గ్రామసభలో చర్చించకుండా తీర్మానాలు చేయని పనులను ఏపీఓ ఇష్టానుసారం మంజూరు చేస్తున్నారని, ఏపీఓపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

దత్తిరాజేరు: మండలంలోకి వి.కృష్ణాపురం గ్రామ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ గురువారం విచారణ చేశారు. గ్రామానికి చెందిన వై.రామారావు అనే వ్యక్తి ఉపాధి పనులకు హాజరు కాకపోయినా ఫీల్డ్ అసిస్టెంట్ మస్తర్లు వేశారని లోకాయుక్తలో ఫిర్యాదు అందింది. దీంతో ఫిర్యాదుదారుల సమక్షంలో వి.కృష్ణాపురం గ్రామ సచివాలయం వద్ద విచారణ చేశారు. నివేదికను ఉన్నాతాధికారులకు పంపిస్తానని ఎంపీడీఓ తెలిపారు. ఏపీఓ అప్పలనాయుడు, సర్పంచ్ మార్పిన ఎర్రయ్యమ్మ, టీఏ శేఖర్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



దత్తిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

దత్తిరాజేరు: తుఫాన్ ప్రభావంతో శుక్రవారం, శనివారం ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని గజపతినగరం వ్యవసాయ శాఖ ఏడీఏ మహరాజన్ సూచించారు. దత్తి,చుక్కపేట, షికారుగంజి, రామచంద్రాపురం గ్రామాల్లో ఏఓ అనురాధతో కలిసి గురువారం పర్యటించారు. రైతులతో మాట్లాడి వరి కోతలు, నూర్పులను రెండురోజుల పాటు వాయిదా వేసుకోవాలని సూచించారు. వీఏఏలు ప్రశాంత్, రాము, దేవి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న సీఐ జి.ఎ.వి.రమణ

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు సైబర్‌నేరాలు, చట్టాలపై స్థానిక సీఐ జి.ఏ.వి.రమణ గురువారం అవగాహన కల్పించారు. ఎవరైనా అపరిచితులు ఫోన్‌లో, సామాజిక మాధ్యమాల్లో బ్యాంకు ఖాతాల సమాచారం అడిగితే చెప్పవద్దని, మొబైల్ ఫోన్‌లకు వచ్చే కొన్ని లింకులను క్లిక్ చేయవద్దని సూచించారు. ప్రిన్స్‌పాల్ రావాడ సత్యనారాయణ, విశ్రాంత మెజిస్ట్రేట్ కె.ఎన్.ఎం.శర్మ, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీష్, న్యాయవాది వాసుదేవ రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు పూలే



చీపురుపల్లి : చీపురుపల్లి పట్టణంలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నినాదాలు చేస్తున్న పూలే అంబేడ్కర్ ఆశయ సాధన సమితి నాయకులు



లక్కవరపుకోట: జమ్మాదేవిపేట ఆశ్రమ పాఠశాలలో జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది



గజపతినగరం: జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

సంఘసంస్కర్త, బడుగు,బలహీన వర్గాల ఆశా జ్యోతి మహాత్మ జ్యోతీరావు పూలే జీవితం ఆదర్శనీయమని, ఆయన ఆశయాలు సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, పూలే అంబేడ్కర్ ఆశయ సాధన సమితి నాయకుడు మిరియాల కృష్ణారావు అన్నారు. జ్యోతీరావు పూలే వర్ధంతిని గజపతినగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో, చీపురుపల్లి పట్టణంలోని లావేరురోడ్‌లో పూలే అంబేడ్కర్ ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో, ఎల్.కోట మండలంలోని జమ్మాదేవిపేట ఆశ్రమ పాఠశాలలో ప్రిన్సిపాల్ యు.విజయ్‌కుమార్‌పాత్రో ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. జ్యోతీరావు పూలే చిత్రపటాలు, విగ్రహాలకు నాయకులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

– గజపతినగరం/చీపురుపల్లి/ లక్కవరపుకోట